ప్రజాశక్తి
ఆదివారం 05 అక్టోబర్ 2025 5 అనంతపురం

అనంతపురంలో ఆటో డ్రైవర్ల సేవలో మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ఆటోడ్రైవర్లకు ప్రభుత్వ సాయం

◆ జిల్లాలో 9275 మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి
◆ రూ.13.91 కోట్లు ఖాతాల్లో జమ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేరకు ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ సాయం అందించారు. ఆటో డ్రైవర్ల సేవలో పేరుతో ఈ పథకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం ఒక్కో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేలను వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం ద్వారా అనంతపురం జిల్లా వ్యాప్తంగా 9275 మంది ఆటో రిక్షా, మాక్సీక్యాబ్, మోటర్ క్యాబ్ డ్రైవర్ కుటుంబాలకు రూ.13.91 కోట్ల లబ్ధి చేకూరింది. ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా నియోజకవర్గం ఎమ్మెల్యేలు, అధికారులు స్వయంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్ని ఆటో డ్రైవర్లకు మెగా చెక్కులను అందించారు. ఎమ్మెల్యేలు ఖాకీ దుస్తులు ధరించి ఆటోలు నడిపారు. బుక్కరాయసముద్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో కలిసి కలెక్టర్ ఆటోలో ప్రయాణించారు. అనంతపురం నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ ఆటోల ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే స్వయంగా ఆటో నడిపి డ్రైవర్లను ఉత్సాహపరిచారు.

బుక్కపట్నంలో ఆటోలో ప్రయాణిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ముక్కపాదల్లో ఉన్న వ్యవసాయ గిడ్డంగి

నిరుపయోగంగా వ్యవసాయ గిడ్డంగి

మందుబాబులకు ఆవాసంగా మారిన వైనం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం నిర్మించిన వ్యవసాయ గోదాము పెద్దవడుగూరులో కంపచెట్ల మధ్య నిరుపయోగంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి గత టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన వ్యవసాయ గిడ్డంగి ప్రస్తుతం ఎందుకు పనికిరాకుండా పోయింది. భవనం చుట్టూ కంపచెట్లు పెరిగి మందుబాబులకు నిలయంగా మారింది. సచివాలయాలు వచ్చిన తర్వాత ఈభవనం గురించి పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమని రైతులు అంటున్నారు. వ్యవసాయ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ భవనాన్ని నిర్మించడం కూడా పనికిరాకుండా పోవడానికి మరో కారణంగా తెలుస్తోంది. కనీసం వ్యవసాయాధికారులు కూడా దీనిపై శ్రద్ధ వహించకపోవడం బాధాకరం. ఇప్పటికే భవనం వెనుక భాగంలో నెర్రలుబారి నాణ్యతను బయట పెట్టేలా ఏమి చేయలేని పరిస్థితులు. కావున ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నాణ్యతను పరిశీలించడంతోపాటు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

జూనియర్ సహాయకులకు ఉద్యోగోన్నతి

అనంతపురం సిటీ : నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం లో జూనియర్ సహాయకులుగా పని చేస్తున్న ఇలియాజ్, రామాంజనేయులకు సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు డిఇఒ ప్రసాద్‌బాబు శనివారం నియామక పత్రాలను అందజేశారు.

డిఇఒ నుంచి నియామకపత్రాలను అందుకుంటున్న జూనియర్ సహాయకులు

కామ్రేడ్ టిఎన్.రసూల్ కన్నుమూత

పలువురి నివాళి

రసూల్ పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

టిఎన్.రసూల్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ టిఎన్ రసూల్(75) శనివారం కన్నుమూశారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో ఆయన తుదిశ్వాస విడిచారు. రసూల్ సుదీర్ఘకాలం కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారు. రసూల్ అజ్ఞాతవాస్య ఉద్యమంలో కళాకారునిగా పని చేశారు. అక్కడి నుంచి సిపిఎంలో చేరి పలు ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. సిపిఎం నుంచి తరిమెల నాగిరెడ్డి విడిపోయిన తర్వాత పార్టీ పునర్నిర్మాణం కోసం అనేక ప్రయత్నాలు జరిగాయి. అప్పట్లో అనంతపురం పట్టణంలో ఏర్పడిన సిపిఎం శాఖలో రసూల్ సభ్యుడుగా ఉండి పని చేశారు. నగరంలో సిపిఎం కార్యకలాపాలకు ఆయన సైకిల్ షాపు కేంద్రంగా ఉండేది. మోటారు వర్కర్స్ యూనియన్, కందుకూరు ఎఫ్‌సిఐ హమాలీ యూనియన్ వర్గాల్లో పార్టీని కాపాడుకోవడం కోసం రసూల్ మిలిటెంట్‌గా నిలిచారు. అజ్ఞాతవాస్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. పార్టీ తరుపున మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గానూ పోటీ చేశారు. పట్టణ కమిటీ సభ్యుడుగా, పూర్తి కాలం కార్యకర్తగా పనిచేశారు. ప్రస్తుత పార్టీ ఆఫీసు నిర్మాణానికి ముందు జరిగిన ఏర్పాట్లలో ఆయన కీలకంగా వ్యవహరించారు. అనంతపురంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన భూ స్వాధీన పోరాటంలో పాల్గొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో విశేష కృషి చేశారు. ప్రజా ఉద్యమం, పోరాటాల్లో భాగంగా ఆయన అనేక కేసులను ఎదుర్కొన్నారు. కేసులకు భయపడకుండా తను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగారు.

పలువురి నివాళి

రసూల్ మరణవార్త తెలుసుకున్న పలువురు ఆయన నివాసం వద్దకు వెళ్లి పార్థివదేహానికి నివాళులు అర్పించారు. రసూల్ మృతదేహంపై సిపిఎం జెండాను కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ రసూల్ మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటన్నారు. మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ పాటు డా॥ప్రసూన, వీరభద్రయ్య, సిపిఎం సీనియర్ నాయకులు వి.ఓబులు, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి తదితరులు రసూల్ పోరాటాలను కొనియాడారు. సిపిఎం సీనియర్ నాయకులు శివారెడ్డి, గౌసిద్దేశ్వర, ముబారక్, ప్రకాష్, వెంకటనారాయణ, వలి, రాయుడు, రాజు, గఫూర్, చిన్న నారాయణస్వామి, రామాంజి, రాముడు, బజ్జా, జిలాన్, షెక్షావలి నివాళులు అర్పించారు.

విలువలతో కూడిన నాయకుడు ఓబులు

కామ్రేడ్ రసూల్ చివరిదాకా కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి పని చేశారని సిపిఎం సీనియర్ నాయకుడు జి.ఓబులు తెలిపారు. పేదల కోసం ప్రజా ఆందోళనలు నిర్వహించి వారికి అండగా నిలిచారన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో భూస్వాధీన పోరాటం నిర్వహించి అనేకమంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించారన్నారు. ప్రజా ఉద్యమాలలో రసూల్ ఎన్నో కేసులను ఎదుర్కొన్నారని, అయినా వెనకడుగు వేయకుండా ప్రజా ఉద్యమాన్ని నిబద్ధతతో ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు.

అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్టు

దేవాలయాలే లక్ష్యంగా చోరీలు
రూ.22 లక్షల విలువజేసే ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం

దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని అందులో చోరీలకు పాల్పడే ముగ్గురు అంతర్‌రాష్ట్ర దొంగలను కళ్యాణదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22 లక్షల విలువజేసే 12.350కిలోల వెండి, 44 గ్రాముల బంగారు ఆభరణాలు, 20 కిలోల ఇత్తడి గంటలు, 5కిలోల రాగి బిందెను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం నిర్వమించిన మీడియా సమావేశంలో ఎస్పీ పి.జగదీష్ వెల్లడించారు. అనంతపురం జిల్లా శెట్టూరు మండలం మాకొడికి గ్రామానికి చెందిన వి.మర్రిస్వామి ఏ సంగీత, వి.రాజు, ముచ్చర్లపల్లి శ్రీనివాసులు వ్యసనాలు, జల్సాలకు అలవాటుపడి వాటిని తీర్చుకునేందుకు దొంగలుగా మారారు. దేవాలయాలు, ఊళ్లకు దూరంగా ఉన్న ఇళ్లలో దొంగతనాలు చేయడం అలవాటు చేసుకున్నారు. తాళాలు పగులకొట్టి విలువైన బంగారు, వెండి ఆభరణాలు, ఇత్తడి, రాగి వస్తువులను దొంగతనాలు చేశారు. ఇలా అనంతపురం జిల్లాతో పాటు కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గం జిల్లా, హిరియూరు, అబ్బినహాల్, చెళ్లికేర పట్టణాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగలించిన బంగారు, వెండి, ఇత్తడి, రాగి ఆభరణాలు, వస్తువులను విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. దొంగతనాల ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు వీరిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఇందులో భాగంగా కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబుకు అందిన సమాచారం మేరకు కళ్యాణదుర్గం రూరల్, రూరల్ యుపిఎస్ సిఐలు నీలకంఠేశ్వర, వంశీకృష్ణల ఆధ్వర్యంలో ప్రత్యేక బందాలుగా ఏర్పడి నిందితులు ముగ్గుర్ని శనివారం ఉదయం కుర్లపల్లి క్రాస్ వద్ద ఈ ముగ్గుర్ని అరెస్టు చేశారు. వారి నుంచి ఆభరణాలు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ ముగ్గురి అరెస్టుతో ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో 20 కేసులను కళ్యాణదుర్గం రూరల్, యుపిఎస్ పోలీసులు ఛేదించారు.

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతునన ఎస్పీ జగదీష్

ప్రయివేటు ఆసుపత్రులపై నిఘా ఉంచాలి

జిల్లా మలేరియా అధికారి డి ఓబులు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు

ప్రజాశక్తి అనంతపురం

ప్రతి సబ్ యూనిట్ పరిధిలోని మండలాల్లో ఉన్న ప్రయివేటు ల్యాబ్‌లు, ప్రయివేటు ఆసుపత్రులపై నిఘా ఉంచాలని జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు సూచించారు. శనివారం నగరంలోని కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల సబ్ యూనిట్ ఆఫీసర్లతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ ఆసుపత్రుల్లో డెంగీ, మలేరియా టెస్ట్ చేస్తున్నారా..లేదా అని మలేరియా సబ్ యూనిట్ అధికారులు సందర్శించి తెలుసుకోవాలన్నారు. ఏ రకమైన టెస్టు చేస్తున్నారో తెలుసుకుని ఐడిఎస్‌పి, ఐహెచ్‌ఐపి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారో.. లేదో తప్పనిసరిగా కనుక్కోవాలన్నారు. ప్రతి సబ్ యూనిట్ పరిధిలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన డెంగీ నిర్ధారణ కోసం ఎలీషా పాజిటివ్ కేసెస్ వచ్చినప్పుడు ఆ కేసుకు యాంటీ మస్కిటో ఆక్టివిటీస్ తప్పకుండా చేయాలన్నారు ప్రతి సచివాలయంలోని ఎఎన్‌ఎంలు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. ఫీవర్ కేసులు నమోదు చేసేటప్పుడు ఎస్ ఫామ్‌లోనే అప్లోడ్ చేయించాలన్నారు పత్రికలలో అడ్వాన్స్ న్యూస్ వచ్చినప్పుడు వాటికి స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల మలేరియా సబ్ యూనిట్ అధికారులు కె.గిరిధర్‌రెడ్డి, బి.రమేష్, బత్తుల కోదండరామిరెడ్డి, కె.అబ్దుల్‌మునాఫ్, కె.మద్దయ్య, ఎస్.ప్రభాకర్, సి.శ్రీనివాసులు, జి.రామకృష్ణయ్య, ఎస్.తిరుపాలయ్య, సి.నాగేంద్రప్రసాద్, వి.జయరామ్‌నాయక్, శివన్న, డి.రామాంజనేయులు, దేవలనాయక్, డి.గోపీనాయక్, లక్ష్మీనాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు సయ్యద్ నూర్‌బాషా, టి.శ్రీధర్‌మూర్తి, ఎస్.లోకేశ్వర్‌రెడ్డి, రమేష్, బి.శశిధర్‌గుప్తా, మహబూబ్‌బాషా, కెఆర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



పంపనూరు సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయం

'పంపనూరు' పాలక మండలి

నియామకంలో జాప్యం..!

కుంటుపడుతున్న ఆలయాల అభివృద్ధి

ప్రజాశక్తి-ఆత్మకూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా మండల పరిధిలో పంపనూరు గ్రామంలో వెలిసిన సుబ్రమణ్యేశ్వరస్వామి, మలహోబిలేశ్వరస్వామి ఆలయాల కమిటీ నియామకంపై నిర్లక్ష్యం వహిస్తుండటంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ఆలయాల అభివృద్ధి, బాగోగులను పరివేక్షించాల్సిన ఆలయ పాలక కమిటీని నియమించకపోవడంతో భక్తులు, గ్రామపెద్దల్లో అంతర్మథనం మొదలైనట్లు తెలుస్తోంది. అనంతపురానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంపనూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయానికి ప్రతినెలా రూ.లక్షల్లో కానుకల రూపాన వస్తున్నాయి. అయినా ఆలయ అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే కనబడుతోంది. ముఖ్యంగా ఆలయంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా ఆలయ ప్రాంగణంలో తాగునీటి వసతి కల్పించాల్సిన అవసరం ఉంది. ఆయా సమస్యలను పర్యవేక్షించి పరిష్కరించాల్సిన ఆలయ పాలకమండలి కమిటీ ఏర్పాటు చేయకపోవడం ఏంటని స్థానికులు, భక్తులు అంటున్నారు. అదేవిధంగా సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయానికి కూతవేటు దూరంలో కొండపై పురాతన లక్ష్మీనరసింహ మలహోబిలేశ్వర ఆలయం వెలసింది. అయితే రెండేళ్లుగా పాలకమండలి ఏర్పాటు చేయకపోవడంపై అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్టు ఉందని భక్తులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎండోమెంట్ అధికారులు స్పందించి ఆలయ పాలక మండలి కమిటీలు ఏర్పాటు చేయాలని భక్తులు, మండల వాసులు కోరుతున్నారు.

ఆదర్శప్రాయుడు గూళపాలెం హంపన్న

వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి-గుత్తి

మహిళల మానప్రాణాల కోసం అసువులు బాసిన తెంపరి (గూళపాళెం) హంపన్నను యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మహిళల మానప్రాణాలను రక్షించి బ్రిటిష్ సిపాయిల తుపాకి తూటాలకు అమరుడైన గూళపాళ్యం హంపన్న వర్ధంతిని పురస్కరించుకుని గుత్తి కోట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మన్రో సత్రం సమీపంలో ఉన్న హంపన్న స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా, గుత్తి కోట పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బి.ఇస్మాయిల్ మాట్లాడుతూ గుత్తిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ టౌన్ హాల్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. గుత్తి పట్టణ సుందరీకరణ, పురాతన కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. హంపన్న మరణించి యూరోపియన్, హిందూ దేశస్తుల మెప్పు పొందారని ఆంగ్లభాషలో రాసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.సురేష్‌బాబు, యోగా గురువు కృష్ణయ్య, లైన్ ఇన్స్‌పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, భగత్ సింగ్ కమిటీ నాయకుడు నిజాముద్దీన్, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, జనసేన నాయకుడు అశ్వనాగప్ప, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.శ్రీనివాసయాదవ్, ఇషాక్ బాషా, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, బీఎస్పీ నాయకుడు బండల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గూళపాళెం హంపన్నకు నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జగదీష్ శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండలంలో నేరాల శాతం, చోరీలు, ఛేదింపు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండల జనాభా.. పంచాయితీలు.. గ్రామాలు.. సమస్యాతక గ్రామాలపై ఆరాతీశారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలు, రౌడీ షీటర్ల కౌన్సిలింగ్, తదితర విషయాలను ఎస్ఐ సాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. తర్వాత సిబ్బందితో మాట్లాడుతూ వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశులు, సిఐ కౌలుట్లయ్య, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పి.జగదీష్

పశుసంపదను పెంపొందించడమే లక్ష్యం

రాయదుర్గం మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతురెడ్డి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

పశుసంపదను పెంపొందించడమే సిఎం చంద్రబాబు లక్ష్యమని రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతురెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గుడిసెలపల్లి గ్రామంలో ఎడిఇ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉచిత గర్భ ఉత్పత్తి వ్యాక్సిన్ శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత పశు సంపదతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. అందుకోసమే పశు సంపదపై సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పశుగణ అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, డిఎల్‌డిఎ డీడీ డాక్టర్ వెంకటేష్, ఎడి డాక్టర్ నాగలింగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ అమరేశ్వరప్ప, గోపాలమిత్ర గుడిసెలపల్లి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాయదుర్గం మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతురెడ్డి

విద్యతోపాటు కళారంగంపై దృష్టి సారించాలి

కళాఉత్సవ్‌లో వక్తలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రతి విద్యార్థి విద్యతోపాటు కళారంగంపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని మండల విద్యాధికారులు రాముడు, గురుప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరెడ్డి అధ్యక్షతన శనివారం మండలంలోని వీరన్నపల్లి ఉన్నత పాఠశాలలో కళాఉత్సవ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థిలో విద్యతోపాటు కళాతపన ఉండాలని అప్పుడే మనం అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామన్నారు. నృత్యం అనేది అందరితో సాధ్యకాదని, అందులో ప్రావీణ్యం పొందాలంటే రోజు సాధన చేయాలని సూచించారు. అనంతరం ఆరు ఉన్నత, రెండు యుపి, ఆరు ప్రాథమిక, మూడు ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు సుమారు 150మంది పాల్గొని ప్రతిభ కనబరిచారు. ప్రతిభను చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రంతోపాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఆదినారాయణ, విద్యా కమిటీ ఛైర్మన్ రంగనాయకులు, టిడిపి మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, ఇంజినీర్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

విపత్తులో వేగవంతమైన ప్రతిస్పందన అవసరం

అగ్నిమాపక సేవల విభాగం డిజి పి.వెంకటరమణ

ప్రజాశక్తి-అనంతపురం

విపత్తు నిర్వహణలో వేగవంతమైన ప్రతిస్పందన వ్యవస్థ అభివృద్ధి అవసరమని అగ్నిమాపక సేవల విభాగం డిజి పి.వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక జెఎన్‌టియులో కర్నూలు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం.భూపాల్‌రెడ్డి, అనంతపురం అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవలపై జోన్-4 అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లాలో అగ్నిమాపక సదుపాయాల ప్రస్తుత స్థితిగతులపై సమీక్షలు చేయాలన్నారు. అలాగే అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది బలోపేతం,కొత్త సాంకేతిక పరికరాల అవసరంపై చర్చించారు. ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. అనంతరం అధికారులు డీజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి, కడప జోన్-4 పరిధిలోని ఏడు జిల్లాల అధికారులు అన్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అగ్నిమాపక సేవల విభాగం డిజి పి.వెంకటరమణ

విద్యుత్ స్తంభాల సమస్యను తీర్చండి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆర్డీటీ కాలనీలో విద్యుత్ స్తంభాల సమస్య పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు. ఆర్డీటీ కాలనీలోని 15వ రోడ్డులో లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. సమస్యను పలుమార్లు స్థానిక లైన్‌మెన్‌కు విన్నవిస్తే మీరే రూ.10 నుంచి రూ.20వేల వరకూ ఖర్చు భరిస్తే స్తంభాలు మార్చడానికి వీలవుతుందంటూ సమాధానం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో నిర్మాణం చేపట్టడానికే అనేక రకాలుగా అప్పులు చేసుకుని ఇబ్బంది పడుతుంటే.. విద్యుత్ స్తంభాలను మార్చాలని చెబితే ఎలా అని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి ఆర్డీటీ కాలనీలో నెలకొన్న విద్యుత్ స్తంభాల సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్లాట్‌కు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం

ఆటో డ్రైవర్లకు చేయూత

'ఆటో డ్రైవర్ల సేవలో' ఎమ్మెల్యేలు

ఆటోలను నడుపుతున్న విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా ఉంటోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని తేరుబజార్ వద్ద ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా స్థానిక బళ్లారి రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి తేరు బజారు వరకూ ఆటోల ర్యాలీ నిర్వహించారు. స్వయంగా విప్ కాపు ఆటో నడుపుకుంటూ వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఒక్కో హామీని నెరవేరుస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఆటో కార్మికులకు ఏడాదికి రూ.15వేల అందజేసే పథకానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమంతోపాటు అభివృద్ధిని పట్టాలెక్కించినట్లు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, మంత్రి లోకేష్ బాబు నవతరం ఆలోచనల సంకలనంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ దివాకర్‌రెడ్డి, రవాణా శాఖ మోటార్ వాహనాల తనిఖీ అధికారి విశ్వనాథరెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కొండన్న, టిడిపి నాయకులు పసుపులేటి నాగరాజు, మోహన్‌రెడ్డి, లాలెప్ప, కురుబ హనుమంతు, హనుమంతురెడ్డి, పురుషోత్తం, టంకాల హనుమంతు, నాగల్లి రాజు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆటో డ్రైవర్లు స్థానిక బీరప్ప గుడి నుంచి మార్కెట్ యార్డులోని సభావేదిక వరకూ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌తోపాటు కూటమి నాయకులు ఆటోల్లో కూర్చుని వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.15వేల ఆర్థికసాయాన్ని నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. దీంతో ఆటో డ్రైవర్ల కళ్లలో ఆనందం కనిపించిందన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు మెగా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాజాబాబు, కమిషనర్ నయూమ్ అహ్మద్, మెప్మా టిఎంసి మోహన్, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షులు ముక్కన్నగారి గుణశేఖర్, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిందే చేస్తారు.. చేసేదే చెబుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 'ఆటో డ్రైవర్ల సేవలో' భాగంగా శనివారం అనంతపురంలోని అర్బన్ టిడిపి కార్యాలయం నుంచి భారీ ఆటో ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి స్వయంగా ఖాకీ దుస్తులు ధరించి ఆటో నడుపుతూ అందరినీ ఆకర్షించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న సభావేదిక వరకూ ఈ ప్రదర్శన సాగింది. మార్గమధ్యలో అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లాకు సంబంధించిన మెగా చెక్కును ఆటో డ్రైవర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, రవాణా శాఖ అధికారి సురేష్‌నాయుడు, అడిషనల్ కమిషనర్ పావని, టిడిపి నాయకులు తలారి ఆదినారాయణ, రాయల్ మురళి, కోణంకి గంగారం, సింగవరం రవి, సుధాకర్‌నాయుడు, రంగాచారి, పోతుల నరసింహులు, పిఎల్ఎన్ మూర్తి, బొమ్మినేని శివ, కడియాల కొండన్న, పరమేశ్వర్, బెస్త పవన్‌కుమార్, జనబలం బాబా, బాలాంజనేయులు, సరిపూటి రమణ, కుంచపు వెంకటేష్, గుర్రం నాగభూషణం, మోహన్‌కుమార్, పూల బాషా, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్‌యాదవ్, వన్నూరప్ప, దంచాయి వెంకటనారాయణ, సంగా తేజస్విని, ఈటె స్వామిదాస్, గోళ్ల సుధాకర్‌నాయుడు, నరేంద్రచౌదరి, రాయల్ మధు, రాజారావు, సరళ, పావురాల శేఖర్, వడ్డే భవాని, లక్ష్మీనాయుడమ్మ, చరిత, రమాదేవి, నారాయణస్వామి యాదవ్, జోగి రాజేంద్ర, ఇస్మాయిల్, నెట్టెం బాలకృష్ణ, భక్తవత్సలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : ఎన్నికల సమయంలో హామీ మేరకు ఆటో కార్మికులను ఆదుకున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. 'ఆటో డ్రైవర్ల సేవలో' భాగంగా శనివారం ఆటో కార్మికులకు మెగా చెక్కు అందజేశారు. ముందుగా ఆటో కార్మికులతో కలిసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా స్థానిక ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, రామ్మోహన్‌చౌదరి, ఆర్డీఓ వసంతబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, పోలీస్, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట నుంచి ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ ఓ.ఆనంద్, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడుతో కలిసి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి, పసుపుల శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : 'ఆటో డ్రైవర్ల సేవలో' భాగంగా శనివారం ఏర్పాటు చేసిన ఆటోల ర్యాలీని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. ఇందులో భాగంగా అనంతపురం రూరల్ పరిధిలోని ఐరన్‌మార్ట్ నుంచి ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : 'ఆటో డ్రైవర్ల సేవ'లో భాగంగా శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి మెగా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శివరామకృష్ణ, రవాణా శాఖ అధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లులో మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ఆటోల ర్యాలీని ప్రారంభిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆటోల ర్యాలీని ప్రారంభిస్తున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కలెక్టర్

ఆటో కార్మికులక మెగా చెక్కు అందజేస్తున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం పరిశీలన

పామిడి : పామిడి గ్రామ పంచాయతీలోని నాయీ బ్రాహ్మణ కాలనీలో రూ.61,640 అంచనా వ్యయంతో జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్న మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణాన్ని ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖకుమార్ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, డివిఇఒ, ఎంపిడిఒ తేజోష్ణ, ఎపిఒ ఆదినారాయణమ్మ, జెఇ తులసమ్మ, ఇసి టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

డి.హీరేహాల్ : ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులకు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఎను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రెన్యువల్ చేయాలని కోరుతూ ఆర్డీటీ అభిమాన సఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 56 ఏళ్లుగా ఆర్డీటీ సంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశేష సేవలు అందిస్తోందన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు వచ్చేందుకు రెన్యూవల్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే రెన్యువల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు శైలమ్మ, నిరుపమ, రాధమ్మ, గాదిలింగప్ప, యశోదమ్మ, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

అనంతపురం : ఎస్‌జిఎఫ్ అనంతపురం ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలోని డిఎస్ఎ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతరం ప్రతిభ ప్రదర్శించిన బాలబాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల పాఠశాల క్రీడా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, ఎపిఎస్‌ఎపిఇ ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తకు పరామర్శ

శింగనమల : అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మండల పరిధిలోని చిన్నమట్లగొంది గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త సంజీవులును వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సంజీవుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అంతవరకూ వైసిపి అండగా ఉంటుందని భరోసా వచ్చారు. ఈయన వెంట సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు శ్రీరామిరెడ్డి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

శింగనమల : కలెక్టర్ ఓ.ఆనంద్‌ను ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ శనివారం అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఐటిడిపి ఛాంపియన్ మునీంద్ర, సోమనపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఈ-పంట నమోదు గడువు పెంపు

యాడికి : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు గడువును ఈనెల 25వ తేదీ వరకూ గడువు పెంచినట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు 25వతేదీలోగా ఈక్రాప్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. సామాజిక తనిఖీ, సవరింపులు, మార్పుచేర్పులకు ఈనెల 30వతేదీ వరకూ వరకు అవకాశం ఉంటుందన్నారు. తుది జాబితాను ఈనెల 31న రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పోరుబాట'ను విజయవంతం చేద్దాం

బెలుగుప్ప : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి ఈనెల 7వతేదీన విజయవాడలో నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమానికి ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు చెక్కే తిప్పేస్వామి, నరేష్, అర్జున్, శ్రీనివాసమూర్తి, అర్జున్, వెంకట సురేష్, సూర్యనారాయణ, తిప్పేస్వామి, వేణుగోపాల్, ప్రభాకర్, హుస్సేన్‌పీరా, మోహన్, రాము, నాగేంద్ర, లక్ష్మీపతి, సూర్యనారాయణ నాయక్, జనార్ధన్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌ను కలిసిన అపుస్మా నేతలు

వెంకటరమణను సన్మానిస్తున్న అపుస్మా నేతలు

అనంతపురం : అనంతపురం వచ్చిన ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ వెంకటరమణను అనంతపురం ప్రయివేట్ అనైడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అపుస్మా నాయకులు వెంకటరమణకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు కె.సుబ్బారెడ్డి, జిల్లా సెక్రటరీ రవిశంకర్ ప్రసాద్, గాజుల చంద్ర, మధుసూదన్‌రెడ్డి, అన్వర్, సుగుణాకర్, రామచంద్రారెడ్డి, రఘునాథ్‌రావు, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులతో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం

యాడికి : మండల పరిధిలోని కోన ఉప్పలపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేసినట్లు డిప్యూటీ ఎంపిడిఒ శశికళ, ఎపిడి పుల్లారెడ్డి, సర్పంచు రామాంజనేయులు తెలిపారు. ఈమేరకు గ్రామంలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రెయన్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు, దుర్వాసన, దోమల వృద్ధిని నియంత్రించడానికి మ్యాజిక్ డ్రెయిన్ ఎంతో సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి అసిస్టెంట్ నరేంద్ర, ఈసీ ఈశ్వర్‌రెడ్డి, ఎపిఒ చిన్న మద్దిలేటి, కార్యదర్శి అరుణ్, టిఎ బాబా ఫక్రుద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో వివరాలు సేకరిస్తున్న అధికారులు

హెచ్ఎల్సీ అధికారుల పరిశీలన

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని పెద్ద ఎక్కులూరి గ్రామాన్ని హెచ్‌ఎల్‌సి అధికారులు శనివారం పరిశీలించారు. చాగల్లు రిజర్వాయర్ నిర్మాణంలో పెద్ద ఎక్కులూరులో ఊటనీరు ఉబికి వస్తోంది. దీంతో గ్రామస్తులు తమను ఆదుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో గ్రామంలోని ఎస్‌సి కాలనీని హెచ్‌ఎల్‌సి అధికారులు పరిశీలించారు. ఇందులోఉ భాగంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్చెల్సీ అధికారులు పార్థసారథి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంత వేలంపాట

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామంలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంతకు పంచాయతీ కార్యదర్శి శివయ్య ఆధ్వర్యంలో శనివారం వేలంపాట నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్.వన్నూరుస్వామి రూ.80వేలకు పాట పాడి దక్కించుకున్నట్లు సర్పంచు కోటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి దాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపి సిఇసి సభ్యునికి అభినందనలు

కళ్యాణదుర్గం టౌన్ : వైసిపి సిఇసి సభ్యునిగా నియమితులైన నియోజకవర్గ వైసిపి నాయకులు ఉమామహేశ్వర్‌నాయుడును వైసిపి నాయకులు శనివారం అభినందించారు. ఇందులో భాగంగా కళ్యాణదుర్గంలోని క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మారుతమ్మ, వైసిపి నాయకులు అంజినేయులు, కొత్తూరు బాబు, రిజ్వాన, తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర్‌నాయుడును అభినందిస్తున్న నాయకులు

IN THE COURT OF THE CIVIL JUDGE
(SENIOR DIVISION)GOOTY
H.M.O.P. 211/2024

Between:
R. Pakkiramma ...Petitioner
AND
Y. Bala Gangaiah ...Respondent

PERSONAL NOTICE TO THE RESPONDENT

TO,
Y. Bala Gangaiah S/o. Ganganna D.No.2/423, Ambedkar Colony, Tadipatri Town and Mandal, Anantapur District.

పై విడాకుల అర్జీలో ప్రతివాది అయిన Y.బాల గంగయ్య అయిన నీకు, ఎన్నిసార్లు నోటీసులు పంపినా తీసుకోనక కాలయాపనచేయడం జరిగినది. అందువలన కోర్టువారి ఉత్తర్వుల మేరకు యిందు మూలముగా ప్రతివాది అయిన మీకు తెలియచేయడము ఏమనగా, ప్రతివాది అయిన మీరు కాని లేదా మీ తరపున మీ వకీలుకాని 27/10/2025 తేదిన పై కోర్టులో హాజారు అయి సమాధానము వేసుకోన వలేను. అట్లు హాజరు కాక సమాధానము వేసుకోక పోయిన యెడల కోర్టు వారు మీ యందు పరోక్షముగా తీర్మానము చేసి తీర్పు వెల్లడించుదురని యిందువెంట తెలుపడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
కే.మనోహర్ బాబు,
వాదిపరం అడ్వకేట్, గుత్తి

దసరా సందడేది..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దసర వచ్చిందయ్యా.. సరద తెచ్చిందయ్య అని చెప్పుకునే వారు. ఇప్పుడు పరిస్థితి వేరే విధంగా ఉంది. ఈ ఏడాది దసరా వచ్చింది కాని సంబరాలు తీసుకురాలేదు. పండుగ సందడి ఎక్కడా పెద్దగా కనిపించలేదు. మొక్కుబడిగానే ముగిసింది. ఒకవైపు అదును తప్పి వస్తున్న వర్షాలు, మరోవైపు ప్రభుత్వ తోడ్పాటు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న రైతాంగానికి కష్టాలు తప్పడం లేదు. ఈ వారంతో ఖరీఫ్ ముగిసింది. రబీ ఆరంభమవుతోంది. ఖరీఫ్‌లో లాగానే ఆరంభంలో వర్షాలు పడి ఇప్పుడు లేకుండాపోయాయి. ఇప్పుడు సెప్టంబర్ ఆరంభంలో మంచి వర్షాలే వచ్చినప్పటికీ ఆ తరువాత నుంచి తగ్గుతూ వస్తున్నాయి. ఇంకో వైపు ప్రభుత్వం కూడా పంటల సాగుపై ఏ మాత్రం దృష్టి సారించలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్‌లో సకాలంలో వర్షాల్లేకపోవడంతో సాగు భూమి పెద్ద ఎత్తున బీడుంది. ఆగస్టు ఆఖరులో పడిన మంచి వర్షాలకు ప్రత్యామ్నాయం అయినా ఇస్తారని రైతులు ఎదురుచూశారు. కాని ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఊసే లేకుండా ఈసారి ఎత్తేసింది. ఈ ప్రభావం ఖరీఫ్ సాగుపై స్పష్టంగా కనిపించింది. ఇక రబీలోనైనా సంసిద్ధంగా ఉందా అంటే అదీ లేకుండాపోయింది. మొన్నటి వరకు పడిన వర్షాలకు రబీలో పప్పుశనగ పంట అయినా సాగు చేసుకునే వారు. కాని ధర నిర్ణయం ఆలస్యంగా జరిగింది. ఇప్పుడు సేకరించి పంపిణీ ఇప్పటికీ ఆరంభమవలేదు. మరోవైపు వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఇస్తే విత్తనం విత్తుకునేందుకు అనువుగా ఉంటుందా.. లేదా..? అన్నది చూడాల్సి ఉంది. ప్రభుత్వం రైతాంగ సమస్యలపై పట్టించుకోవడం లేదన్న విపక్షాలు విమర్శలు చేస్తూనే ఉన్నాయి. ఇప్పటికే ఇంకా చాలా మంది రైతులకు అన్నదాత సుఖీభవ సాయం ఖాతాల్లో పడలేదు. రాని వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. గతేడాది పంటనష్టానికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇప్పటికీ రాలేదు. రెండు జిల్లాల నుంచి కూడా ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఊసే ఎత్తడం లేదు. ఇక సాగునీటి రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శ ఉంది. ఎందుకంటే ఇప్పటికీ జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించలేదు. ఒకవైపు జిల్లాకు పుష్కలంగా సాగునీరు వచ్చినా దాని వినియోగంపై నిర్ణయం జరగలేదు. నేతల ఒత్తిడి ఎటువైపు ఉంటే అటువైపు మళ్లిస్తున్నారన్న విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆటో వాల సేవ పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. శనివారం నాడు జిల్లా వ్యాప్తంగా ఈ పథకం కింద ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు పంపిణీ చేశారు. ఇక సిఐటియు అనంతపురం జిల్లా మహాసభలు గత వారంలో అనంతపురం నగరంలో జరిగాయి. జిల్లాలో సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడంతోపాటు, వాటి పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించారు. రాబోయే మూడేళ్ల కాలంలో కార్మిక ఉద్యమాలపై చర్చించారు. నూతన కమిటీ ఎన్నికైంది. ఇక త్వరలో అనంతపురం నగరంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. వీటిని విజయవంతం చేయడానికి జిల్లా కమిటీ కృషి చేస్తోంది. ఇప్పటికే జిల్లా మహాసభలు పూర్తయి ఉన్నాయి. ఇక రాష్ట్ర మహాసభలను దిగ్విజయం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కూడా ఇప్పటికే ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలని కోరుతూ ఈనెల 6వతేదీన అనంతపురంలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6వతేదీన అన్ని ప్రజాసంఘాలు, దివ్యాంగ సంఘాలు, కులసంఘాలు, రాజకీయ పార్టీల సమక్షంలో ఆర్ట్స్ కాళాశాల నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకూ భారీ ర్యాలీగా వెళ్లనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టి ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, వికలాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి రాజేష్, నియోజకవర్గ అధ్యక్షులు నామాల ఈశ్వర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సుగమంచి శ్రీనివాసులు, రాష్ట్ర దళిత సేవా అధ్యక్షులు ఎల్లుట్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్యాంగ్ రేప్ నిందితులను శిక్షించాలి

వైసిపి గిరిజన విభాగం ప్రధాన కార్యదర్శి శివకుమార్ నాయక్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 9వ తరగతి చదువుతున్న గిరిజన బాలికను ఎత్తుకెళ్లి విశాఖపట్నం జిల్లాలో మూడు రోజులు నిర్బంధించి సామూహిక అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వైసిపి గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విద్యుత్‌నగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ఎప్పుడూ అధికారంలోకి వచ్చినా గిరిజనులకు రక్షణ ఉండదన్నారు. గతంలో తీసుకుంటే అనేక ఘటనలు ప్రొఫెసర్లపై దాడి, డాక్టర్లపై దాడి, రెవిన్యూ ఉద్యోగులపై దాడి, అమాయక గిరిజనులు భూములు లాక్కోవడం వంటి అనేకమంది గిరిజనులపై దాడులు పాల్పడం ఆనవాయితీగా ఉంటుందని విమర్శించారు. మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా తాటతీస్తానని పలికే పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఏమయ్యాడని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణ స్పందించి నిందితుల్ని కఠినంగా శిక్షించి బాధ్యత కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి గిరిజన విభాగం ప్రధాన కార్యదర్శి శివకుమార్ నాయక్

ప్రకృతి వనరులను కాపాడుకుందాం

గుంతకల్లు : ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జె.పద్మావతి సూచించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మస్తాన్‌పేట-1, కథలవీధి ప్రాంతాల అంగన్వాడీ కేంద్రాల్లో ప్రకృతి వనరులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి వనరులను వృథా చేయరాదన్నారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు నాగమణి, శాంతి, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 1009.495 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం : జిల్లాకు కోరమండల్ కంపెనీ కి చెందిన యూరియా1009.495 మెట్రిక్ టన్నులు శనివారం ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు వచ్చినట్లు ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. వచ్చిన యూరియాలో మార్క్‌ఫెడ్‌కు 520 మెట్రిక్‌టన్నులు, ప్రయివేటు డీలర్లకు మన గ్రోమోర్ సెంటర్లకు 489.495 మెట్రిక్ టన్నులను జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

నార్పల : 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు గ్రామంలో తిరుగుతూ జీఎస్టీ వల్ల ఏమేమి రేట్లు తగ్గాయో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గుంతకల్లు

దసరా సందర్భంగా స్థానిక మోదీనాబాద్ ఏరియాలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన విజేతలకు టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు, 37వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి చికెన్ జగన్ శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై యువతకు ఉత్సాహం కల్పించేందుకు క్రికెట్టు టోర్నమెంట్ నిర్వహించామన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో విజేతలుగా బెంచ్ కొట్టాల హాసీం 8 టీం రన్నర్, మోదీనాబాద్ యంగ్ స్టార్ టీం విన్నర్ నిలిచారన్నారు. విన్నర్ టీంకు రూ.10వేల నగదుతోపాటు ట్రోఫీ అందజేశారు. అదేవిధంగా రన్నర్ టీంకు 5వేలు నగదు బహుమతి ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల జగన్నాథ్, 4వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి నగరడోన్ రవికుమార్, 33వ టిడిపి ఇన్‌ఛార్జి నగరడోన వీరేష్, టిడిపి నాయకులు అంజి, ఆర్గనైజర్స్ నవీన్, భరత్, ఆనంద్, వీరేష్, శాంతిరాజ్, పౌల్, అంజి డిజె, అశోక్, అంజి లిటిల్ స్టార్ టీం, లడ్డా వీరేష్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

విజేలతకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

నేరాలు ఘోరాలు

వృద్ధుడు ఆత్మహత్య

మృతిచెందిన వృద్ధుడు

గుత్తి : గుత్తి జిఆర్‌పి స్టేషన్ పరిధిలోని పామిడి కల్లూరు ఆర్‌ఎస్ మధ్య రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జిఆర్‌పి పోలీసులు తెలిపిన వివరాల మేరకు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధుడు రైలు కింద పడి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసినవారు గుత్తి జిఆర్‌పి పోలీసులకు తెలపాలన్నారు. ఘటనపై జిఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.